క్లుప్తంగా

కొలనుభారతిలో విశేష పూజలు



పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయిస్తున్న తల్లిదండ్రులు

కొత్తపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొలనుభారతిదేవి ఆలయంలో భక్తులు విశేష పూజలు చేశారు. సోమవారం మాఘ మాసం ఉత్తరాయణం కృష్ణ పక్షం, బహుళ పంచమి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి సన్నిధిలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

కొలతల ప్రకారం పనులు చేస్తే అధిక కూలి



కూలీలకు సూచనలు ఇస్తున్న ఈసీ, టీఏ

జూపాడుబంగ్లా: నిర్ణీత కొలతల ప్రకారం ఉపాధి పనులు చేస్తే రోజువారి కూలి రూ.300 వస్తుందని ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ నజీర్‌బాషా, టీఏ చిన్న తెలిపారు. సోమవారం మండలంలోని తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించారు. మస్టర్స్‌ను పరిశీలించి కూలీల వివరాలు తెలుసుకున్నారు. ఉదయం 6 గంటల్లోగా పనుల వద్దకు చేరుకుని ఒక్కొక్కరు ఆరు మీటర్ల పొడవు, మీటరు లోతు పనులు చేస్తే గరిష్ఠ కూలి వస్తుందని తెలిపారు.

మినీ వాటర్ ట్యాంక్ ప్రారంభం



ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, సర్పంచ్

పగిడ్యాల: మండలంలోని ఎం.ఘణపురం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.05 లక్షలతో నిర్మించిన మినీ వాటర్ ట్యాంక్‌ను జెడ్పీటీసీ సభ్యుడు పుల్యాల దివ్య, సర్పంచ్ ప్రతాపరెడ్డి సోమవారం ప్రారంభించారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ గణపురం శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పుల్యాల నాగిరెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగార్జునరెడ్డి, మోక్షంరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం లోపిస్తే కఠిన చర్యలు



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నందికొట్కూరు: పట్టణంలో పారిశుద్ధ్య పనులు లోపిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ బేబి హెచ్చరించారు. సోమవారం నందికొట్కూరులోని సాయిబాబాపేట, రాజావీధి, కేజీ రోడ్డుతో పాటు ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్యం పనులను పరిశీలించారు. ప్రధాన రహదారిపై ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ పైపులైన్ లీకేజీని కమిషనర్ పరిశీలించారు. వీధుల వెంట పారిశుద్ధ్యం లోపించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ వాటర్ పైపులైన్ లీకేజీకి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

నేడు మండల సర్వసభ సమావేశం

నందికొట్కూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని కోరారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూస్తాం

కొత్తపల్లి: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మహమ్మద్ జుబేర్, ఇన్‌చార్జ్ ఈఎఆర్డీ పార్థసారథి అన్నారు. సోమవారం కొత్తపల్లి, ఎం.లింగాపురం, గోకవరం గ్రామాల్లో నీటి సమస్యపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. మండలంలో ఉన్న ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా బోర్లు, మోటార్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గువ్వలకుంట్ల, జీవీరాపురం, శివపురం, ఎర్రమఠం, పాత మాడుగుల, నందికుంట గ్రామాల్లో సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. ప్రతి గ్రామానికి రూ.4 లక్షల నివేదికలను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపించామన్నారు. గోకవరం సర్పంచ్ మారెన్న, పంచాయతీ కార్యదర్శి స్రవంతి పాల్గొన్నారు.

ముమ్మరంగా మహాశివరాత్రి ఏర్పాట్లు

మహానంది: మహానందిలో శివరాత్రి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇటీవల ఆలయంలో జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించేందుకు వచ్చిన దేవదాయశాఖ రాష్ట్ర జాయింట్ కమిషనర్ చంద్రశేఖర ఆజాద్ ఆదేశాల మేరకు అధికారులు మహిళా భక్తులతో పాటు పురుషులకు వస్త్రాలు మార్చుకునే గదిని ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆలయ ఆవరణలోని ఉత్తర గోపురం వైపున ఉచిత దర్శనానికి వెళ్లే మార్గంలో అదనపు క్యూలైన్లను ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం రాత్రి సంబంధిత విభాగం సిబ్బంది ఏర్పాట్లు పరిశీలించారు.



పురుషుల కోసం ఏర్పాటు చేసిన వస్త్రాలు మార్చుకునే గది



అదనపు క్యూలైన్లు ఏర్పాటు చేసిన దృశ్యం

మహానందీశ్వరుడికి పల్లకీసేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

మహానంది: మహానందిలో సోమవారం రాత్రి పల్లకీ సేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవాన్ని కనులపండుగగా చేపట్టారు. ధ్వజస్తంభం వద్ద స్వామి, అమ్మవార్లకు హారతి ఇచ్చిన అనంతరం తిరిగి అలంకార మండపానికి చేర్చారు. కార్యక్రమాల్లో ఆలయ సూపరింటెండెంట్ దేవిక, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న భక్తుల రద్దీ

మహానందిలో భక్తులరద్దీ కొనసాగుతుంది. సోమవారం కావడంతో పలు ప్రాంతాల భక్తులు వేలాది సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. భక్తులు స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి మధ్యాహ్నం, మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు దర్శనం కొనసాగింది. రాత్రి స్వామివారి దంపతులకు ఏకాంత సేవ పూజలు నిర్వహించగా ఆర్జిత సేవాటికెట్ల ద్వారా భక్తులు పూజల్లో పాల్గొని స్వామి, అమ్మవారి ప్రసాదాలు స్వీకరించారు.

నేడు కోఆర్డినేషన్ సమావేశం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై మంగళవారం రెండవ కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మొదటి సమావేశం నంద్యాలలోని ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించామని, రెండో సమావేశాన్ని మహానందిలోని పోచా బ్రహ్మానందరెడ్డి డార్మెటరీ భవనంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

20న హుండీ కానుకల లెక్కింపు

మహానందిలో ఈ నెల 20న హుండీ కానుకల లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ తెలిపారు. కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండరామాలయం, వినాయకనంది, ఆంజనేయస్వామి ఆలయాల్లోని హుండీలతో పాటు అన్నప్రసాద విభాగం, గోసంరక్షణ నిధి విభాగాల్లోని హుండీలను లెక్కిస్తామన్నారు. సిబ్బంది అందరూ హాజరు కావాలని ఆదేశించారు.



మహానందీశ్వరుడి దర్శనార్థం క్యూలో వేచివున్న భక్తులు

స్వామి సన్నిధిలో పెనుగొండ పీఠాధిపతి

మహానందీశ్వరస్వామి సన్నిధిలో పెనుగొండ పీఠాధిపతి కైలేశ్వరస్వామి సోమవారం పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈఓ ఎరమల మధు, ఆలయ సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం శ్రీనివాసులు(చిన్నా) స్వాగతం పలికారు. కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించిన అనంతరం అలంకార మండపంలో వేదపండితులు ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు.



పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న అధికారులు

నేటి నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు

వెలుగోడు: మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి తెలిపారు. 18న వెలుగోడు సచివాలయం- 2, 19న వేల్పనూరు- 1, 20న రేగడ గూడూరు- 1, 21 వెలుగోడు- 2, 24న మోత్కూరు, 25న వెలుగోడు- 4, 27న బోయిరేవుల, 28న వెలుగోడు -2వ సచివాలయాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామ పంచాయతీలలో ఆధార్ క్యాంపులకు సంబంధించి దండోరా వేయించవలసిందిగా గ్రామ కార్యదర్శులను ఆదేశించారు.

లాకిన్స్‌లా నుంచి 570 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి తూడిచెర్ల సబ్ ఛానల్ కాల్వకు 570 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీ కాల్వకు సుంకేసుల డ్యాం నుంచి 1,600, ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం రెండు మోటార్ల నుంచి 490 క్యూసెక్కుల నీరు వస్తున్నాయన్నారు. లాకిన్స్‌లా వరకు 1,118 క్యూసెక్కుల నీరు చేరుతుండగా అందులో తూడిచెర్ల సబ్‌ఛానల్ కాల్వకు 570 , నిప్పులవాగుకు 548 క్యూసెక్కుల నీరు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.

లైంగిక వేధింపు.. ఇద్దరి అరెస్ట్

నందికొట్కూరు: మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో నిందితులు గొల్ల రామకృష్ణ, వెంకటేశ్వర్లు అరెస్టు చూపించారు. నిందితులు నందికొట్కూరు మండల పరిధిలోని వడ్డేమాన్ గ్రామంలో ఓ మహిళ ప్రైవేట్ వీడియోలు రహస్యంగా తీశారన్నారు. తమ కోరిక తీర్చకపోతే వీడియోలను అందరికీ పంపిస్తామని బెదిరింపులకు పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు వెల్లడించారు.

శివరాత్రి విశిష్టతపై అవగాహన

పాములపాడు: శివరాత్రి పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మునిదాసు అన్నారు. సోమవారం మండలంలోని లింగాల గ్రామంలో శివరాత్రి పండుగపై ప్రచారం నిర్వహించారు. శివలంగంపై ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులని తెలిపారు. జాగరణ అంటే మాయపై జాగృతి కలిగి జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవజ్ఞానాన్ని తెలియజేయడం అర్థం అని వివరించారు. శివరాత్రిని మోక్ష రాత్రి అని అంటారన్నారు. విలువైన సమయాన్ని, ఆయుష్షును దైవ ధ్యాసలో ఉంచాలని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికి భగవద్గీత, అనుబంధ గ్రంథాలను పంపిణీ చేశారు. ఆత్మకూరు, చింతపల్లి కమిటీ సభ్యులు సంజీవ పార్థసారథి, చక్రపాణి, మనోహర్, కుమార్, ఆచారి, నాగమద్దిలేటి, వెంకటేశ్వమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న త్రైత సిద్ధాంత సభ్యులు

అంగన్‌వాడీలకు కనీస వేతనం ఇవ్వాలి



నందికొట్కూరు: ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్

నందికొట్కూరు: అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ వర్కర్లు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ సెంటర్లుగా మార్చు, హెల్పర్లకు ప్రమోషన్లు, పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, టీఏలు మంజూరు చేయాలని కోరారు.

-కొత్తపల్లి: అంగన్‌వాడీలకు సమ్మె ఒప్పంద హామీలు అమలు చేసి వేతనాలు పెంచాలని.. గ్రాట్యూటీ అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు హరిత, నాగమణి, శ్రీదేవి అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మకు వినతిపత్రాన్ని అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, విజయమ్మ, లక్ష్మీదేవి, సునీత, ప్రభావతి, సరస్వతి, పార్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మహానంది: గోపవరం సమీపంలో బొలేరో వాహనం ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గాజులపల్లెకు చెందిన నరసింహ బైకుపై నంద్యాలకు వెళ్తుండగా.. ఎదురుగా మిర్చి లోడుతో వస్తున్న బొలేరో వాహనం ఢీకొంది. గాయాలైన నరసింహను స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జెడ్పీ నిధులతో తాగునీటి ట్యాంకుల నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ శివశంకరరెడ్డి

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం ముష్టపల్లె గ్రామంలో జెడ్పీ నిధులతో తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి జెడ్పీటీసీ జి. శివశంకరరెడ్డి సోమవారం భూమి పూజ చేశారు. గ్రామంలో ఎస్టీ కాలనీ సమీపంలో కాలనీ వాసుల సౌకర్యార్థం తాగునీటి ట్యాంకు నిర్మించాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి రూ.5లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. దీంతో ముష్టపల్లెలో రెండు చోట్ల ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ దేవీబాయి, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరరావు, రామునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార లోపంతో క్షయవ్యాధి

పాములపాడు: చిన్న పిల్లల్లో పోషకాహార లోపం వల్లనే క్షయ వ్యాధి వస్తుందని ఆత్మకూరు టీబీ యూనిట్ సూపర్‌వైజర్ చెరుకు రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని యర్రగూడూరులో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..15 రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో రోగనిరోధక శక్తి పెరగడానికి ప్రతి రోజు యోగా, వ్యాయామం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి, హెల్త్ అసిస్టెంట్ ముర్తుజాబి, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కొత్తపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా మండల అధికారులు పనిచేయాలని తహసీల్దార్ ఉమారాణి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను విచారించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. నలుగురు రైతుల నుంచి భూముల ఆన్‌లైన్, ఇద్దరు రైతుల నుంచి భూముల కొలతల కోసం వినతులు వచ్చాయని చెప్పారు.

సమ్మె ఒప్పంద హామీలు అమలు చేయాలి

ఆత్మకూరు: అంగన్‌వాడీలకు సమ్మె ఒప్పంద హామీలు అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్ నాయక్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి మంజుల, నాయకురాలు లక్ష్మీదేవి, రవణమ్మ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి గౌడ్ సెంటర్, కొత్త బస్టాండ్, తహసీల్దార్ కార్యాలయం మీదుగా ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆత్మకూరు, వెలుగోడు, బండి ఆత్మకూరు, మహానంది మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు వారి సమస్యలు పరిష్కరించాలని ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రణధీర్, స్వాములు, ఇస్మాయిల్, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ, లక్ష్మీనారాయణమ్మ, ప్రియాంక, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ పాఠశాలలను సవరించండి

ఆత్మకూరు: మండలంలోని పాఠశాలల క్లస్టర్లను సవరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని పాఠశాలలను కలిపి నాలుగు క్లస్టర్లుగా విభజించారని, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 10, జిల్లా పరిషత్ ఉర్దూ పాఠశాలకు 9, జిల్లా పరిషత్ కురుకుందకు 14, వెంకటాపురం జిల్లా పరిషత్‌కు 26 పాఠశాలలు అనుసంధానం చేశారన్నారు. ఈ పాఠశాలల వల్ల వెంకటాపురం పాఠశాలకు కేటాయించిన క్లస్టర్ పాఠశాలలకు వెళ్లాలంటే 18 కిలోమీటర్ల దూరం ఉన్నందున వీటిని పునః పరిశీలించాలన్నారు. శ్రీపతిరావుపేట, ఇందిరేశ్వరం పాఠశాలలు వెంకటాపురానికి దగ్గరగా ఉన్నప్పటికీ కురుకుంద పాఠశాలకు కేటాయించడం సరికాదన్నారు. కొత్తరామాపురం ఉర్దూ పాఠశాలను వెంకటాపురం క్లస్టర్‌కు వేయడం వల్ల 15 కిలోమీటర్ల దూరం ఉందని వెళ్లాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు నూర్‌మహమ్మద్, రామిరెడ్డి, చాంద్‌బాషా, చంద్రశేఖర్, ప్రదీప్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ స్పెషల్ డ్రైవ్

పాములపాడు: చిన్నారులకు ఆధార్ నమోదు కోసం నిర్వహించనున్న స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..ఈ నెల 18న పాములపాడు, 19న వానాల, 20న మద్దూరు, 21న మిట్టకందాల, రెండో విడతగా 24న బానుమక్కల, 25న బానకచెర్ల, 27న యర్రగూడూరు, 28న చెలిమిల్ల పంచాయతీల్లోని గ్రామ సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దంపతులను కలిపిన ఆత్మకూరు పోలీసులు

ఆత్మకూరు: మండలంలోని శ్రీపతిరావు పేట గ్రామానికి చెందిన హేమలతను తెలంగాణ రాష్ట్రంలోని సుల్తానాపురం గ్రామానికి చెందిన హరీష్ అనే వ్యక్తితో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పాప జన్మించిన అనంతరం భార్యభర్తల మధ్య విభేదాలు రావడంతో విడిపోయారు. సోమవారం ఈ దంపతులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. సీఐ రాము మాట్లాడుతూ ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ ఆదేశాల మేరకు దంపతులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి చర్చించినట్లు చెప్పారు. శ్రీపతిరావుపేటకు చెందిన హేమలతను వారి తల్లిదండ్రులు పిలిపించి చర్చించారు. హేమలత తాను భర్త వద్దకు వెళ్తానని అంగీకరించడంతో.. హరీష్‌ను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినట్లు చెప్పారు. అనంతరం భార్యభర్తలను కలిపి వారి ఇంటికి పంపారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో మిఠాయిలు పంపిణీ చేశారు.



దంపతులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ రాము

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

పగిడ్యాల: మండలంలోని ఎం.ఘణపురం గ్రామంలో సోమవారం గణపతి, ఉమామహేశ్వర, సుబ్రమణ్య, నందీశ్వర, ధ్వజస్తంభ, నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాలకు తరలివచ్చిన బంధుమిత్రులతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ముచ్చుమర్రి పోలీసులు బందోబస్తు చేపట్టారు. భక్తులకు గ్రామస్తులు అన్న దాన కార్యక్రమాలను ఏర్పాటు చేసి సంప్రదాయాన్ని పాటించారు.



దేవతామూర్తులకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పగిడ్యాల: ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత వనుములపాడు గ్రామ సమీపంలోని నీటి మునక పొలాల్లో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన మత్స్యకారులు మృతదేహాన్ని గుర్తించి రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. వీఆర్వో భగవాన్‌దాస్ ఫిర్యాదు మేరకు నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ శరత్ కుమార్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు సుమారు 40 ఏళ్ల వయస్సు కలిగి ఉన్నాడు. జుట్టుకు రబ్బర్ బ్యాండ్ వేసుకుని బ్లూ, తెలుపు రంగు కలిగిన గళ్ల చొక్కాతో పాటు లోపల బ్లూ కలర్ అంగీ ధరించి ఉన్నాడు. మృతదేహం గుర్తు పట్టలేనంతగా కుళ్లిపోగా వెనుక భాగాన్ని కుక్కలు పీక్కుతినడంతో తుంటి ఎముకలు బయటపడ్డాయి. ఇది హత్యా.. ఆత్మహత్య.. లేక ప్రమాదావశాత్తు జరిగిందా అన్న కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. చనిపోయి వారం రోజులకు పైగా అవుతోందని.. బ్యాక్‌వాటర్ తగ్గుముఖం పట్టడం వల్ల మృతదేహం ఆనవాలు బయటపడ్డాయని సీఐ వెల్లడించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు సాధ్యం కాకపోవడంతో డాక్టర్‌ను బ్యాక్‌వాటర్ వద్దకే పిలిచి పోస్టుమార్టం తంతును పూర్తి చేయించారు. పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా దర్యాప్తు చేస్తామని.. ప్రస్తుతం అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న రూరల్ సీఐ సుబ్రమణ్యం, ఎస్ఐ

రెండువేల మంది రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య



మోత్కూరు గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ పవన్‌కుమార్

వెలుగోడు: మండలంలోని మోత్కూరులో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ.. మండలంలో ఇప్పటిదాకా 2వేల మంది రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి వారికి విశిష్ట సంఖ్య జారీ చేశామన్నారు. రైతుల పేర్లను రిజిస్ట్రీలో నమోదు చేసి విశిష్ట సంఖ్య(యూసీ) ద్వారా ఆధార్ తరహాలో ప్రతి రైతుకు 11 నెంబర్లతో యూనిక్ కోడ్ కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కావున భూమి ఉన్న ప్రతి రైతు పట్టాదారు పాసుపుస్తకం లేదా 1బీ, ఆధార్ కార్డు, ఆధార్ కార్డు లింక్ చేసిన మొబైల్‌తో గ్రామ, వార్డు సచివాలయాల్లో ఫిబ్రవరి 25 తేదీలోగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓతో పాటు సెరికల్చర్ అసిస్టెంట్ నాగలింగం తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

జూపాడుబంగ్లా: మండలంలోని భాస్కరాపురం గ్రామానికి చెందిన ప్రకాశం (42) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ మాధవి భర్త గోవిందు, గ్రామస్తులు సోమవారం అంత్యక్రియల నిమిత్తం రూ.10వేల నగదును మృతుని కుటుంబానికి అందజేశారు. మృతునికి భార్య మార్తమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. బోయ జయరాముడు, కదిరి పుల్లయ్య, నరసింహ, ధర్మన్న, అంకన్న తదితరులు పాల్గొన్నారు.



మృతుడి కుటుంబానికి నగదు అందజేస్తున్న గ్రామస్తులు